

# ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి!

ప్రతీ పరాయి భాషా
ఒక కీకారణ్యమే!
అందులోకి ప్రవేశించే సాధనం
దాని వ్యాకరణమే!

## తెలుగు విద్యార్థుల కోసం ఇంగ్లీషు గ్రామరు పాఠాలు

రంగనాయకమ్మ

# ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి!

ప్రతీ పరాయి భాషా
ఒక కీకారణ్యమే!

అందులోకి ప్రవేశించే సాధనం
దాని వ్యాకరణమే!

## తెలుగు విద్యార్థుల కోసం
## ఇంగ్లీషు గ్రామరు పాఠాలు


## రంగనాయకమ్మ



స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్
76 లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీహిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

**రచనా కాలం :**
2000 అక్టోబరు నించీ,
2002 మే వరకూ.

**పేజీలు : 361**
[రాయల్ సైజులో,
హార్డ్ బౌండ్‌తో]
**ధర : 120 రూ.లు**

**1వ ముద్రణ :** 2002 జూలై
**2వ ముద్రణ :** 2002 డిసెంబరు
**3వ ముద్రణ :** 2004 జనవరి
**4వ ముద్రణ :** 2005 మార్చి
**5వ ముద్రణ :** 2006 డిసెంబరు
**6వ ముద్రణ :** 2007 ఆగస్టు
**7వ ముద్రణ :** 2008 జనవరి
**8వ ముద్రణ :** 2009 డిసెంబరు
**9వ ముద్రణ :** 2011 మే

**కంపోజింగ్ & పేజ్ మేకప్ :**
ఎమ్. శారద

**ముద్రణ :**
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020.

**ప్రతులకు :**
అరుణా పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్డు,
విజయవాడ - 520 002.
(ఫోన్: 0866 - 2431181).

**రంగనాయకమ్మ** అడ్రసు :
76, లేక్-సైడ్ కాలనీ,
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీహిల్స్ పోస్టు,
హైదరాబాదు - 500 033.

# విషయ సూచిక

**దీని చరిత్ర (ముందుమాట)**

**1. అక్షరాలూ, మాటలూ ........ 20**
(1) Alphabet - పేజీ 21; (2) ఇంగ్లీషు ని రాసేటప్పుడు పెద్దా - చిన్నా అక్షరాలు ఎక్కడెక్కడ వస్తాయి? - 21; (3) అచ్చులూ, హల్లులూ - 22; (4) సిలబుల్ - 25; (5) స్పెల్లింగుల తలపోటు - 26. (6) ఆల్ఫబెటికల్ వరస - 28.

**2. కొన్ని ప్రారంభ విషయాలు ........ 29**
(1) Number - 29; (2) Gender - 30; (3) Tense - 31; (4) Articles - 32; (5) Subject, Object, Verb (కర్త, కర్మ, క్రియా) - 38; (6) Person (పురుష) - 39.

**3. Parts of Speech (భాషా భాగాలు) ........ 41**
(1) Noun - 41; (2) Pronoun - 43; (3) Verb - 47; (4) Adjective - 48; (5) Adverb - 51; (6) Preposition - 54; (7) Conjunction - 57; (8) Interjection - 58. (9) Exercises - 59.

**4. వాక్యాలు ప్రారంభం ........ 60**
★ పోజిటివ్ వాక్యాల్ని ప్రశ్నలుగా మార్చడం - 65;
★ నెగెటివ్ వాక్యాల్ని ప్రశ్నలుగా మార్చడం - 66;
★ There తోటీ, It తోటీ వాక్యాలు - 80; ★ Exercises - 81.

**5. 'Question' Words ........ 82**
★ 'ప్రశ్న' పదాలతో ప్రశ్నలు - 83; ★ Tag ప్రశ్నలు - 86;
★ Exercises - 87.

**6. Verb Root (క్రియా మూలం) ........ 88**
★ క్రియల్లో ప్రధాన విభజన - 92; ★ Exercises - 96.

**7. కాల భేదాలు వర్తించని Order క్రియలు ........ 97**
★ Exercises - 105.

**8. కాల భేదాలు లేని General క్రియలు ........ 106**
★ కొన్ని ప్రత్యేక వ్యక్తీకరణలు - 118.

**9. కొన్ని వేరు వేరు విషయాలు ............................ 120**

(1) వాక్య నిర్మాణాల్లో తేడా - 120; (2) సకర్మక, అకర్మక క్రియలు - 121; (3) వాక్యాల్లో **4** రకాలు - 123; (4)Subject–Predicate -125; ★ Exercises - 126.

**10. Present Simple**
**Past Simple**
**Future Simple ......................................... 127**

★ V1, V2లు - 130; ★ Strong క్రియలూ, Weak క్రియలూ - 140; ★ Exercises - 141.

**11. Emphatic క్రియలు ...................................... 142**

★ Exercises - 147.

**12. Finite, non-finite, to infinitive క్రియలు ... 148**

★ Exercises - 152.

**13. Present Continuous**
**Past Continuous**
**Future Continuous................................. 153**

★ Exercises - 166.

**14. Present Perfect**
**Past Perfect**
**Future Perfect ........................................ 167**

★ క్రియల conjugation-171; ★ V3 గురించి ఇంకా-189; ★ 'Present, Past, Perfect' participles - 193.

**15. Present Perfect Continuous**
**Past Perfect Continuous**
**Future Perfect Continuous .................. 198**

★**3** కాలాల్లో, 12 దశల్లో వాక్యాలు-204; ★Exercises -205.

**16. Helping క్రియలు ........................................ 205**

★ 24 helping క్రియలు - 206; ★ modal క్రియలు - 207: can–could - 208; may–might - 217; shall–will - 223;





would - 224; should - 228; must - 232; ought to - 234; (have to - 237); need - 240; dare - 246; used to - 248.

**17. ఫ్రేజులూ, క్లాజులూ;**
**Simple, Compound, Complex వాక్యాలు ..... 251**

★ Phrase అంటే - 251; ★ Clause అంటే - 252; ★ Simple వాక్యం - 253; ★ Compound వాక్యం - 255; ★ Complex వాక్యం - 257; ★ Sequence of tenses (కాలాల వరస) - 268.

**18. Direct Speech and Indirect Speech ....... 279**

★ direct speech, indirect speech గా మారే నియమాలు - 281

**19. Voice: Active – Passive ............................ 293**

★ Active, Passive క్రియల నియమాలు - 301
★ Emphatic క్రియల్ని passiveగా మార్చడం - 311
★ Modal క్రియల్ని ....... passive గా - 312
★ To infinitive క్రియల్ని passive గా - 313
★ 'ప్రశ్నల్ని' ................ passive గా - 315
★ Order వాక్యాల్ని ........ passive గా - 319
★ Direct object, Indirect object - 321
★ Participles తో passive వాక్యాలు - 324
★ Washed clothes, Clothes washed - 326
★ Passive గురించి ఒక ప్రత్యేక విషయం - 328
★ Passive లాగే వుంటుంది, కానీ, Passive కాదు - 329
★ Get Passive - 334
★ 'పుట్టడం' లేని భాష - 336

**20. ఇంకా కొన్ని విషయాలు .................................. 340**

★ Case అంటే - 340; ★ Phrasal క్రియలు - 354.

➢ **ఈ పుస్తకాలు కూడా చదవండి! - 358**

➢ **విద్యార్థులు ఏం చెయ్యాలంటే ... - 359**


★

# దీని చరిత్ర
## (ముందు మాట)

మొదట క్లుప్తంగా చెపుతాను.

''ఇంగ్లీషు గ్రామరు పాఠాలు రాసియ్యమ్మా, సీరియల్‌గా వేస్తాను'' అని **'నామిని'** నన్ను పట్టుకున్నాడు, రెండేళ్ళ కిందట. (అప్పుడు అతను 'ఆంధ్రజ్యోతి' వీక్లీ కి ఇన్-చార్జిగా వుండేవాడు.) నేను ఆశ్చర్యపోయి అప్పుడు పూర్తిగా తిరస్కరించాను. కానీ, చివరికి అదే ఇలా పరిణమించింది.

ఇప్పుడు కొంచెం వివరంగా చెపుతాను. నామిని అలా అడగడానికి ఒక కారణం వుంది. ఏడేళ్ళ కిందట, నేను నిజంగానే కొన్ని గ్రామరు పాఠాలు రాశాను. రాసిపెట్టమని గాంధీ అడిగితే అవి రాశాను. అతను సెంట్రల్ యూనివర్సిటీలో టీచరు. తెలుగు మీడియం నించి వచ్చే చాలా మంది పేద కుటుంబాల స్టూడెంట్స్‌కి క్లాసుల్లో ఇంగ్లీషుతో చాలా ఇబ్బందిగా వుందనీ, ఏమీ అర్థం చేసుకోలేకపోతున్నారనీ, అతను చెప్పేవాడు. ఇంగ్లీషు భయంతో కోర్సులు మధ్యలో వదిలిపెట్టి పోయిన స్టూడెంట్స్ గురించి చెప్పేవాడు. అలాంటి స్టూడెంట్స్ కోసం, ఇంగ్లీషు గ్రామరు ఎంతో కొంత నేర్పడానికి ఈవెనింగ్ క్లాసులు తీసుకోవాలని అతను అనేవాడు.

''ఏ భాష నేర్పాలన్నా అందులో 'క్రియ'ని అర్థమయ్యేలాగ చెప్పాలి. మిగిలినవన్నీ దాని తర్వాతే'' అనేదాన్ని నేను.

నన్నే కొన్ని పాఠాలు రాసి ఇవ్వమని అడిగాడు. నిజానికి నాకు ఏమీ రాదు. కానీ, ఆ స్టూడెంట్స్‌కి అంత కన్నా రాదు కాబట్టి, వారిని దృష్టిలో పెట్టుకుని కొంచెం ఆలోచించాను.

దాని కన్నా ముందు ఇంకో సంగతి జరిగింది. ఒక సారి ఇద్దరు స్టూడెంట్స్ నా దగ్గిరికి వచ్చారు. బియ్యేలు చదువుతున్నామనో, పాసయ్యామనో, చెప్పారు. నేను రాసిన ఫలానా పుస్తకం చదివామనీ, తమకు నచ్చిందనీ, చెప్పారు. వాళ్ళ చదువుల గురించి వాకబు చేస్తోంటే, వాళ్ళిద్దరికీ కూడా **is** కీ, **was** కీ తేడా తెలియడం లేదని అర్థమైంది. నేను చాలా ఆశ్చర్యపోయి చిన్నప్పటి నించీ వాళ్ళ చదువులు ఎక్కడెక్కడ సాగాయో వివరాలడిగాను. చెప్పారు. గ్రామాల్లో చాలా మంది పిల్లల విషయంలో లాగే ఇంగ్లీషు సరిగా రాని టీచర్ల దగ్గిర వాళ్ళ చదువులు ప్రారంభమయ్యాయి. అయితేనేం? చిన్నప్పటి చదువులు ఎలా సాగినా, బియ్యేలూ ఎమ్మేలూ చదివేనాటికి కూడా ఇంకా **is** కీ **was** కీ తేడా తెలీని స్థితిలో వుండడం అంటే, అది వాళ్ళ తప్పే గానీ, చిన్నప్పుడు గ్రామరు చెప్పని టీచర్ల తప్పు అవదు. ఆ సంగతే వాళ్ళకి చెప్పి, ''ఇప్పటికైనా మీరు ఏదైనా గ్రామరు పుస్తకం మొదలుపెట్టి చదువుకోండి. రోజూ



కొన్ని ఎక్సర్‌సైజులు చెయ్యండి'' అని చెప్పాను.

అప్పటి నించీ అలాంటి స్టూడెంట్సు నా దృష్టిలో వుంటూనే వున్నారు. దానికి తోడు, గాంధీ కూడా అలాంటి స్టూడెంట్స్ గురించే చెప్పి వాళ్ళ కోసమే పాఠాలు కావాలన్నాడు.

నాకు స్కూలు రోజుల నించీ కూడా వ్యాకరణం అంటే చాలా ఆసక్తి వుండేది. కానీ, చిన్నప్పుడు చదివిన స్కూల్లో (తాడేపల్లిగూడెం హైస్కూల్లో) ఇంగ్లీషు గ్రామరు ఒక్క ముక్క కూడా నేర్పలేదని బాగా గుర్తే. కాకపోతే, ''J.V. రమణయ్య గ్రామరు చదువుకోండి'' అని చెప్పేవారు. ఆ పుస్తకాలు చాలా మంది పిల్లల దగ్గిర వుండేవి. నా దగ్గిర కూడా వుండేది. దాన్ని చాలా సార్లు తిరగేసినట్టు కూడా గుర్తే. కానీ, మేష్టార్లు బొత్తిగా చెప్పకుండా పిల్లలే గ్రామరు పుస్తకాలు స్వయంగా చదివేసి అన్నీ నేర్చేసుకునే పరిస్థితి ఎక్కడ వుంటుంది? ఆ పుస్తకం తిరగెయ్యడమే మిగిలింది గానీ, ఆ నాడు అందులో నించి ఒంటబట్టించుకున్నదేమీ లేదు.

తర్వాత కాలంలో ఇంట్లో పిల్లలకు చదువులు చెప్పుకోవలసిన బాధ్యత మీద పడ్డప్పుడు, మళ్ళీ గ్రామరు పుస్తకాల కోసం వెతుకులాట ప్రారంభమైంది. పిల్లలకు నేర్పాలంటే, ముందు పెద్దలకు రావాలి కదా? అప్పటి నించీ గ్రామరు మీద ఒకటే ఆసక్తి.

ఆ రకంగా, ఏ నాడూ టీచర్లు చెప్పకుండానే, అక్కడా ఇక్కడా అర కొరగా చదివి నేర్చుకుని మిడికిన గ్రామరు పరిజ్ఞానం తోటే, గాంధీ అడిగిన పాఠాలు రాయడానికి ఒప్పేసుకున్నాను. ఆ మాత్రం పాఠాలు అతనే రాసుకోవచ్చు గానీ, నేనైతే 'చాలా గొప్పగా' రాస్తానని అతను అనుకున్నాడు. అతని కన్నా నేనే బాగా రాస్తానని నేనూ అనుకున్నాను. 'పిల్లలకు ఉపయోగపడుతుందేమో, రాసి పెడదాం' అని రాశాను. 'I am, He is' లాంటి వాక్యాల నించీ మొదలుపెట్టి passive voice దాకా కూడా రాశాను. కానీ, చాలా క్లుప్తంగా. అంతా చిట్టి పొట్టి వాక్యాల తోటే. 'క్రియలు' తప్ప అందులో ఏమీ లేవు. అదంతా కలిసి 200 పేజీల నోట్ బుక్‌లో పట్టింది.

గాంధీ, ఆ పాఠాలే పట్టుకుపోయి, తన 'కవిత్వం' కూడా జోడించుకుని, కొన్ని నెలల పాటు (వారానికి రెండు రోజులు; రోజుకి రెండు గంటలు) ఆ స్టూడెంట్స్ పని పట్టించాడు. ఆ అమాయకులు, ఆ మాత్రానికే చాలా సంతోషించారు. ఆ రకంగా, గాంధీ, 2, 3 సెమిస్టర్లలో ఆ పాఠాలతో 'సంఘ సేవ' చేశాడు. (తర్వాత కాలంలో, 'యూజీసీ' ద్వారా ఆ స్పెషల్ క్లాసుల ఏర్పాటు జరిగింది.)

ఆ సంగతంతా ఐదేళ్ళ తర్వాత, ఈ మధ్య కాలంలో, **నామిని** చెవిన పడింది. పిల్లల చదువుల గురించి మాట్లాడుకునే సందర్భంలో, గాంధీ, నామినితో,

ఒకప్పుడు తను తీసుకున్న 'స్పెషల్ క్లాసుల' సంగతి చెప్పాడు.

నామిని, వెంటనే నేను రాసిన ఆ నోట్ బుక్కు కావాలని అడిగి తీసుకుని జిరాక్స్ చేయించుకుని తిరిగి ఇచ్చాడు.

అప్పటి నించీ నామిని కి నాతో ఇంగ్లీషు గ్రామరు రాయించాలనే ఆలోచన ప్రారంభమైంది. ఆ పాఠాలన్నీ ఇంకా వివరంగా రాయమని నన్ను అడగడం మొదలుపెట్టాడు.

నేను మొదట చాలా ఆశ్చర్యపోయాను. అతనికి చాలా విధాలుగా చెప్పాను. ''నాకు ఇంగ్లీషు బాగా వచ్చని నువ్వనుకుంటున్నట్టుంది. నా కేమీ రాదు. మరీ చిన్న పిల్లల్లాంటి వాళ్ళ కోసం నాలుగు ముక్కలు రాస్తే, అది చూసి నా కేదో వచ్చనుకుంటున్నావు. అది నిజం కాదు'' అని చెప్పాను.

''కాదమ్మా! మీరు 'తెలుగు నేర్పడం' రాశారు. 'వాడుక భాష' మీద రాశారు. వ్యాకరణం మీకు బాగా తెలుసు కదా?'' అన్నాడు.

''మన మాతృ భాష మనకు కొట్టిన పిండి. దాని మీద రాయడం వేరు. తెలిసీ తెలియకుండా పరాయి భాషలో వేలు పెడితే, ఈత రాకుండా సముద్రంలో వురికినట్టే. అందులో మునగడమే గానీ తేలడం వుండదు'' అన్నాను.

''కాదమ్మా! మీకు తెలిసిందే చాలు'' అన్నాడు.

''ఆ మాట నువ్వంటే ఎలాగ? నా శక్తి నాకు తెలుసు కదా? నేను చెయ్యలేని పని చెయ్యమని అడుగుతున్నావు. అసలు ఇదంతా ఎందుకు? ఇంగ్లీషు కి తెలుగులో కూడా చాలా గ్రామరు పుస్తకాలు వున్నాయి. మంచి పుస్తకాలే వున్నాయి'' అని కొన్ని పుస్తకాల గురించి చెప్పాను.

''ఉన్నాయమ్మా, లేవని కాదు. అవన్నీ స్టూడెంట్స్ చదువుతూనే వున్నారు. అన్ని పుస్తకాలు వున్నప్పుడు ఇంకో పుస్తకం వుంటే ఏమిటి నష్టం? వాళ్ళు రాసినట్టు వాళ్ళు రాశారు, మీరు రాసినట్టు మీరు రాయండి. మంచిదే కదా? స్టూడెంట్స్‌కి ఉపయోగపడుతుంది కదా?'' అని వాదించాడు.

''నిజమే. మంచిదే. కానీ ఆ పుస్తకం నిజంగా ఉపయోగపడాలంటే, దాని కోసం నువ్వు నన్ను ఎంచుకోవడం రాంగ్ సెలెక్షన్. కానీ, గ్రామరు సంగతి జ్ఞాపకం చేసి మంచి పనే చేశావు. చాలా సార్లు అనుకున్నాను, ఎప్పుడైనా కొన్నాళ్ళు ఖాళీ దొరికితే, గ్రామరు ఇంకా బాగా చదువుకోవాలని. నువ్వడిగింది నేను చెయ్యలేను గానీ, నా కోసం నేను నేర్చుకుంటాను. బాగా గుర్తు చేశావు'' అని సంతోషించాను.

అంత చెప్పానా? పది రోజుల్లోనే మళ్ళీ, ''ఎందాకా వచ్చిందమ్మా?'' అన్నాడు.

నేను ఆశ్చర్యపోయి, మళ్ళీ అదే చెప్పాను.



''అలా కాదమ్మా!'' అన్నాడు. అతనూ అదే చెప్పాడు.

నేను అప్పటికే **J.V.** రమణయ్యగార్ని బైటికి తీశాను. రెన్ అండ్ మార్టిన్లని కూడా తీశాను. డిక్షనరీలు తీశాను. పుస్తకాల అరల్లో వున్న గ్రామరు పండితులందర్నీ తీశాను. ఎవరి ఇళ్ళల్లో ఎలాంటి పండితులు వున్నారో వాకబులు చేశాను. కానీ, అప్పుడు నా మనసులో వున్నదంతా నా కోసం నేను నేర్చుకోవాలనేదే. 'ప్రచురణ' కోసం అనే అభిప్రాయం ఏ కోశానా లేదు. అప్పుడు నాకు కొంత టైము దొరికింది. ఏ పుస్తకం పని లోనూ లేను. గ్రామరంటే నాకు ఎలాగూ ఇష్టం. కాబట్టి, ఆ పనే పెట్టుకుని, రోజూ అదే పనిలో వుండి, నోట్స్ రాసుకోవడం మొదలుపెట్టాను.

వారం రోజుల్లోపలే నామిని మళ్ళీ 2, 3 సార్లు ఫోన్లు చేశాడు.

గాంధీ నా దగ్గిరకి వచ్చి, ''నామిని ఫోన్ చేశాడు'' అంటాడు, ప్రతీ సారీ.

''ఈ సారి అతని ఫోన్ వస్తే నాకు చెప్పకు. అతనితో చెప్పాల్సిందంతా ఏ నాడో చెప్పేశాను. ఇంకా అతనితో సాగదల్చుకోలేదు నేను'' అని చెప్పేశాను ఒక సారి.

ఇక అప్పటి నించీ వాళ్ళిద్దరే మాట్లాడుకోవడం. అతను ఇతనితో, ''ఏమంటున్నారు సార్?'' అంటాడు, నా గురించి.

ఇతను అతనితో, ''అంత కంగారుపెట్టకు. ఆమెకి అసలే నీ మీద చాలా కోపంగా వుంది. ఆర్నెల్ల దాకా మాట్లాడకు'' అంటాడు.

అతను నవ్వేసి, మళ్ళీ వారం తిరక్కుండానే, ''అడ్వర్టయిజ్ చేసేస్తే బాగుంటుంది సార్! సీరియల్ ని నెల తర్వాతైనా మొదలు పెట్టుకోవచ్చు. కొంచెం కొంచెం గా రాసి ఇస్తే చాలు'' అంటాడు.

ఒక సారి గాంధీ నాతో, ''సీరియల్ మొదలు పెట్టేస్తానంటున్నాడు. ఎడ్వర్టయిజ్ చేసేస్తానంటున్నాడు'' అన్నాడు.

''అదేదో నువ్వు రాసి ఇచ్చెయ్యి. నీ పేరుతో ఎడ్వర్టయిజ్ చేయించుకో'' అన్నాను.

నే నిలా అన్నానని గాంధీ నామినితో అంటే, అతను నవ్వి — ''మీ మొహం! రాయడం మీ యూనివర్సిటీల ప్రొఫెసర్లకేం వచ్చు సార్? మీరు రాస్తే నేనెందుకు వేస్తానూ?'' అన్నాడు. — గాంధీ చాలా సంతోషించాడు, తనని వదిలేసినందుకు.

నామిని నా సంగతి మాత్రం వదలదల్చుకోలేదు. గాంధీని వాకబు చేస్తూనే వున్నాడు.

ఇక అప్పుడు ఒక 'మంచి' విషయం జరిగింది. నామిని ఉద్యోగం చేస్తున్న పత్రిక మూత పడింది. అతని ఉద్యోగం ఊడింది. అబ్బా! అది విన్నప్పుడు నాకు ఎంత హాయిగా అనిపించిదో! 'అతనికి ఉద్యోగం పోయిందే!' అని కొంచెం బాధేసినా, అతను ఎలాగైనా బతికేస్తాడనే నమ్మకం వుంది. అయినా అతని 'కష్టం' సంగతి

నా కెందుకు? నా కష్టం లోంచి నేను బైటపడడం నాకు ముఖ్యం.

''నీకు ఉద్యోగం ఊడిందట కదా? ఆహా! ఎంత బాగుందో నాకిప్పుడు! ఎంత పీడించావు నన్ను!'' అని అతన్ని పలకరించాను.

''ఆ ఉద్యోగం పోతే యేమ్మా? ఇంకో పత్రికలో చేరకుండా వుంటానా? కొందరం కలిసి ఇంకో పత్రిక గురించి ప్లాన్ చేస్తున్నాం. నీ కెందుకు, నువ్వు రాసెయ్యమ్మా!'' అన్నాడు.

నేను అతన్ని ఆ పూట నించీ పూర్తిగా వదిలేశాను.

కానీ, నేను గ్రామరు మీద ఒక చాప్టరు తర్వాత ఒక చాప్టరు రాసుకుంటూనే ఉన్నాను. ఎక్కడికక్కడ బోలెడు సందేహాలు వచ్చేవి. వాటి కోసం ఎన్నో మూలలు వెతకవలసివచ్చేది. అవి క్లియరైనప్పుడు చాలా సంతోషంగా వుండేది. మధ్యలో కొన్నాళ్ళు వేరే పని కోసం గ్రామరు పని మానేశాను. అది నాకు చాలా అశాంతిగా తయారైంది. ఏ మాత్రం సమయం దొరికినా, గ్రామరు కోసమే పెట్టాను. కానీ, అప్పటికి నాకు 'ప్రచురణ వుద్దేశ్యం' లేదు.

తర్వాత రోజుల్లో కూడా నామిని కొన్ని సార్లు అడిగాడు. కానీ, అతనికి, కొత్త పత్రిక పెట్టే ఆశ కూడా పోయింది. క్రమంగా అడగడం మానేశాడు.

7,8 నెలలు గడిచేటప్పటికి నా దగ్గిర చాలా నోట్స్ తయారైంది. నాకు చాలా విషయాలు క్లియర్ అయ్యాయి.

అసలు నాకు మొదటి నించీ గ్రామరు నేర్పే విషయం మీద ఒక అభిప్రాయం వుంది, 'క్రియ'కే ప్రత్యేకత ఇవ్వాలని. క్రియ అర్థమైతేనే భాష అర్థమవుతుంది. ఈ విషయం వ్యాకరణ రచయితలకు తెలియనిది కాదు. 'క్రియ — చాలా ముఖ్యమైన భాగం' అని అందరూ చెపుతారు. కానీ, తమ పుస్తకాల్లో క్రియకి ఇవ్వవలసిన ప్రత్యేకత ఇవ్వరు. లేదా, ఇవ్వవలసినంతగా ఇవ్వరు.

గ్రామరు పుస్తకాలు చూసినప్పుడు నాకు ఈ విషయంలో చాలా అసంతృప్తిగా వుంటుంది. ఎంతో మంచి సమాచారం ఇస్తూ, ఎంతో శ్రద్ధతో రాసినట్టు కనపడే పుస్తకాల్లో కూడా, క్రియ మీద శ్రద్ధ వుండదు. 'శ్రద్ధ వుండదు' అంటే అసలే వుండదని కాదు. అల్లాగైతే అది గ్రామరు పుస్తకమే అవదు. క్రియ గురించి ఎంత వుండాలో అంత వుండదు.

అంతే కాదు, చాలా పుస్తకాల మీద నాకు ఇంకో అసంతృప్తి ఏమిటంటే, ఇంకా చెప్పని 'కాలాల్ని' కూడా ఎక్కడబడితే అక్కడ వాడెయ్యడం. చాలా పుస్తకాల్లో 2,3 పేజీలైనా దాటకుండానే passive voice వాక్యాలు వచ్చేస్తాయి. present tense ని నేర్పుతూ వున్న పాఠంలోనే ఇతర tense లు కూడా కనపడతాయి. ఇది ఎక్కువ సార్లు జరగకపోయినా, ఇలాంటివి మొత్తంమీద జరుగుతూనే వుంటాయి.



తెలుగు పిల్లలకు తెలుగు భాష నేర్పేటప్పుడు, ఏ వాక్యాన్ని ఏ కాలంలో మాట్లాడినా పిల్లలు అర్థం చేసుకోగలుగుతారు, వాళ్ళకి ఆ భాష అంతా వచ్చి వుంటుంది కాబట్టి. అయినా కూడా, మాతృ భాషలో కూడా, గ్రామరు నేర్పాలంటే, ఒక క్రమాన్ని పాటించాలి కదా? ఇక, పరాయి భాషలో అయితే, వేరే చెప్పాలా? అది చెప్పలేనంత అవసరం. కానీ,చాలా పుస్తకాల్లో ఈ క్రమాన్ని సరిగా పాటించరు. మాతృ భాషని నేర్పడానికీ, పరాయి భాషని నేర్పడానికీ తేడాని సరిగా పట్టించుకోరు. — అయినప్పటికీ, ఒక గ్రామరు పుస్తకంలో కొన్ని పొరపాట్లూ లోపాలూ వున్నా, చాలా మెరిట్స్ కూడా వుంటాయి. ఆ రకంగా, ఆ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది.

కానీ, ఒక పరాయి భాషని నేర్చుకోవడానికి ఒకే ఒక్క పుస్తకం, అది ఎంత మంచిదైనా, చాలదు. ఎందుకంటే, అన్ని విషయాలూ ఒకే పుస్తకం లోకి రావు. వేరు వేరు విషయాల్ని వివరిస్తూ వేరు వేరు పుస్తకాలు వుండవలసిందే.

ఇలా ఆలోచించినప్పుడు, 'క్రియ' మీద ఎక్కువ శ్రద్ధ పట్టే విధంగా ఒక పుస్తకం ఎందుకు ఇవ్వకూడదు? — అనే ఆలోచన ప్రారంభమైంది. అప్పటి నించీ ఈ పని చేద్దామనీ వద్దనీ కొన్ని నెలలు ఊగిసలాడాను. చివరికి అది ఇలా ముగిసింది.

భాషా భాగాల్లో క్రియని తప్ప ఇతర భాగాల్ని చెప్పవలసినంతగా నేను చెప్పలేదు. ఎందుకంటే, ఆ వివరాలు ఇతర గ్రామరు పుస్తకాల్లో చాలా వాటిల్లో దొరుకుతాయి. కాబట్టి, ఆ భాగాలన్నిటినీ నేను క్లుప్తంగానే సరిపెట్టాను.

ఈ పుస్తకం కోసం నేను ప్రధానంగా **4** పుస్తకాల మీద ఆధారపడ్డాను. ఎక్కడ ఏ సందేహం వచ్చినా, ఈ పుస్తకాల్లో వెతుక్కున్నాను.

1) **Cambridge International Dictionary of English.**
   (ప్రచురణ: Cambridge University Press).

2) **J.V.R. English Grammar.**
   By J.V. Ramanaiah & J. Gopalam.
   (ప్రచురణ: S.V. Book Links. Vijayawada-1).

3) **High School English Grammar and Composition.**
   By P.C. Wren & H. Martin.
   (ప్రచురణ: S. Chand & Co. Ltd., New Delhi-55).

4) **Grammar in use.**
   By Raymond Murphy with Roann Altman.
   (ప్రచురణ: Cambridge University Press).

సమాచారం సరిగా ఇవ్వని సందర్భాలు ఈ పుస్తకాల్లో కూడా ఎదురయ్యాయి! ఎంత పండితులు రాసినా ఈ లోపం తప్పదన్నమాట!

ఇతర పుస్తకాల లాగే మీ చేతుల్లో వున్న ఈ పుస్తకం కూడా ఎంతో కొంత నిరుత్సాహం కలిగించవచ్చు. ఎందుకంటే, 'భాష' మీద ఏ పుస్తకమూ దానికదే సమగ్రంగా వుండదు కాబట్టి. అనేక పుస్తకాలు కలిస్తేనే భాషకి కొంత న్యాయం చేస్తాయి. అప్పటికీ అది కూడా అసమగ్రమమే కావచ్చు. భాషలో వుండే అన్ని మూలలూ పుస్తకాల్లోకి రావు, దాని నియమాలు తప్ప. ఆ నియమాలే మార్గ దర్శకాలు.

పిల్లలకు ఏ భాషలో అయినా సరైన పునాది పడలేదంటే అది పెద్ద వాళ్ళ తప్పే. ఆ పెద్ద వాళ్ళు తల్లిదండ్రులైనా కావచ్చు; టీచర్లయినా కావచ్చు. 'తల్లిదండ్రుల' సంగతి చెప్పేదేముంది? నూటికి 80 మంది, నిరక్షరాస్యులు. నోట్లో అక్షరం ముక్కలు లేని వాళ్ళు. ఇంకో పది మంది, కేవలం గవర్నమెంటు లెక్కల్లో మాత్రమే అక్షరాస్యులుగా నమోదయ్యే నిరక్షరాస్యులు. ఇలాంటి తల్లిదండ్రుల్ని తప్పు పట్టడానికేం వుంటుంది?

ఇక బాధ్యతంతా టీచర్ల మీదే పడుతుంది. కానీ, ఆ టీచర్లు కూడా చాలా విషయాల్లో అక్షరాలు తెలిసిన నిరక్షరాస్యులే. వాళ్ళకి, వాళ్ళ చిన్నతనంలో, వాళ్ళ టీచర్లు నేర్పిందేమీ వుండదు. తర్వాత ఎప్పుడో పెద్దయ్యాక, భాషల మీద ఉత్సాహం అంతా అడుగంటాక, స్కూళ్ళల్లో ఉద్యోగాలు చేసుకోవలసిన బతుకు దెరువు బాధ్యత మీద పడ్డాక, అప్పుడు ఇక్కడా అక్కడా వెతుక్కుని నేర్చుకున్న తెలిసీ తెలీని అర కొర జ్ఞానంతో చెప్పడమే ఆ టీచర్లు చెయ్యగలరు. ఆ రకంగా చూస్తే టీచర్లని తప్పు పట్టడానికి మాత్రం ఏం వుంది?

కానీ, పిల్లల్ని తప్పుపట్టకుండా వుండాలంటే, పెద్దల్నే తప్పుపట్టాలి కదా? కాబట్టి, టీచర్లనే తప్పు పట్టాలి. బాధ్యతంతా వాళ్ళదే మరి!

నామిని, ఆ రోజుల్లో నా నించీ ఒక సీరియల్ సంపాదించాలనే దృష్టితో నన్ను విసిగించినా, అతను ఎప్పుడూ ఒక మాట అనేవాడు. 'భాష మీద ఎవరు రాసినా, ఎన్ని రాసినా, అది బాగా వుంటే, గ్రామాల్లో చదువులు చెప్పే టీచర్లకు ఉపయోగపడుతుంది' అనేవాడు.

ఈ పుస్తకం, స్వయంగా చదువుకునే వాళ్ళకు గానీ, పిల్లలకు నేర్పే టీచర్లకు గానీ, కొంచెమన్నా ఉపయోగపడుతుందనే ఆశే లేకపోతే, నేనీ పని చేసేదాన్ని కాదు. ఇతర పనులన్నీ మానుకుని, ఈ పని మీద ఇంత కాలం పెట్టేదాన్ని కాదు. ఆ ఆశ తోనే రాశాను ఇది.

రంగనాయకమ్మ

21-5-2002

# ‘ఇంగ్లీషు’ కీకారణ్యంలోకి ప్రవేశించండి!

ప్రపంచంలో అనేక వందల భాషలు ఉంటాయి. ఏ భాషకైనా, దాని నిర్మాణంలో, కొన్ని ‘నియమాలు (రూల్సు)’ ఉంటాయి.

★ మాటలూ, వాక్యాలూ;

★ స్త్రీలింగం, పుల్లింగం, ఏదీ కాని లింగం;

★ ఏక వచనం, బహు వచనం;

★ జరిగిపోయిన కాలం, జరుగుతూ వున్న కాలం, జరగబోయే కాలం, అన్ని కాలాలకూ చెందే కాలం;

★ ‘భాష’లో భాగాలూ, విభాగాలూ;

★ ‘వాక్యం’లో భాగాలూ, వాక్యాల్లో రకాలూ;

★ కర్తా, కర్మా, క్రియా;

★ చిన్న వాక్యాలూ, పెద్ద వాక్యాలూ, మరీ పెద్ద వాక్యాలూ; — ఈ లక్షణాలన్నీ ప్రతీ ఒక్క భాషకీ ఉంటాయి.

ప్రతీ భాషలోనూ, లింగానికీ, వచనానికీ, కాలానికీ, భాషాభాగాలకూ, ఆ భాష ప్రత్యేకతలకూ, — వీటన్నిటికీ సంబంధించి, రక రకాల నియమాలు ఉంటాయి.

ఒక భాషలో వుండే నియమాలన్నిటినీ కలిపితే, దాని పేరు ‘వ్యాకరణం’ (గ్రామర్).

మనం చిన్నతనం నించీ మాట్లాడే భాష ‘మాతృ భాష’ (మదర్ టంగ్. లేదా, ఫస్ట్ లాంగ్వేజ్).

మాతృ భాష కానిది ‘పరాయి భాష’ (అదర్ టంగ్. లేదా, సెకండ్ లాంగ్వేజ్).

ఒక మనిషికి చిన్నతనం నించీ ఇంట్లో ఒక భాషా, బైట ఇంకో భాషా, అలా రెండు భాషల్లో మాట్లాడడం అలవాటైపోతే, ఆ మనిషికి, రెండు మాతృ భాషలు వున్నట్టు లెక్క. ఇంట్లో మాట్లాడేది మొదటి మాతృ భాషా, బైట మాట్లాడేది రెండో మాతృ భాషా.

రెండేసి మాతృ భాషలు వుండే ప్రత్యేక ఉదాహరణల్ని వదిలేస్తే, సాధారణంగా ఏ మనిషికైనా ఒక్క ‘మాతృ భాషే’ ఉంటుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=889**

* * *

**Read other books of Ranganayakamma @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=181**